సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 4 । జూన్ । 2023



పుడమి పులకరింత

ఏరువాక పౌర్ణమికి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు సన్నద్ధమవుతున్నారు. నాగలి, కాడె, ఎడ్లకు సంప్రదాయంగా పూజలు చేయనున్నారు. 10లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమ చినవెంకన్న క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. 10లో ▸



జాతీయ పోటీలకు ఎంపిక

నూజివీడు ట్రిపుల్ఐటీ విద్యార్థులు ఏడుగురు జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. 10లో ▸

జిల్లావాసులు సురక్షితం

- కోరమాండల్ ప్రమాద ఘటన నుంచి బయటపడ్డ ప్రయాణికులు
- 'పశ్చిమ'కు చెందిన ఇద్దరు, ఏలూరుకు చెందిన ఇద్దరు క్షేమం
- కలెక్టరేట్లలో కంట్రోల్‌రూమ్‌లు
- రైల్వే స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు



ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ వద్ద సిబ్బంది

ఏలూరు (టూటౌన్)/తాడేపల్లిగూడెం: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని స్టేషన్లలో దిగాల్సిన ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. రైలులో ఏలూరు స్టేషన్‌కు ఇద్దరు, తాడేపల్లిగూడెం స్టేషన్‌కు ఇద్దరు రిజర్వేషన్ చేయించుకుని బయలుదేరగా వీరంతా ప్రమాదం బారిన పడ్డారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. షాలిమార్ స్టేషన్ నుంచి తాడేపల్లిగూడెం స్టేషన్‌కు ఉమామహేశ్వర, రంజిత్ దాలీ అనే వ్యక్తులు, సత్రాంగచ్చీ స్టేషన్ నుంచి ఏలూరుకు పిల్లి శ్రీకర్‌బాబు అనే విద్యార్థి, ఘోరాచంద్‌పాల్ అనే బంగారం వ్యాపారి బయలుదేరారు.

తాడేపల్లిగూడెం చేరాల్సిన వారు..

నల్లజర్ల సమీపంలోని పోతవరానికి చెందిన మహేశ్వర కోల్‌కతాలో ఆర్మీలో పనిచేస్తున్నారు. ఆయన ప్రయాణిస్తున్న బోగీ నుంచి సురక్షితంగా బయటపడి జాతీయ రహదారిపైకి చేరుకుని అక్కడి నుంచి భువనేశ్వర్ వెళ్లి ఇతర మార్గాల్లో గమ్యస్థానానికి చేరుకున్నారు. అలాగే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లముదునూరుపాడుకు చెందిన చిరు వ్యాపారి రంజిత్ దాలీకి స్వల్పగాయాలు కాగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం శనివారం సాయంత్రం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో తాడేపల్లిగూడెం చేరుకున్నారు.

ఏలూరుకు చెందిన వారు..

ఏలూరుకు చెందిన పిల్లి శ్రీకర్‌బాబు కోల్‌కతాలోని ఐఎస్ఐ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్)లో మూడో సంవత్సరం పూర్తి చేసుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదం బారిన పడ్డాడు. అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్, కనకం ప్రభుత్వ ఉద్యోగులు. వీరు ఏలూరు జేఎంజే సమీపంలోని లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నారు. సత్రాంగచ్చీ స్టేషన్‌లోని బీ–8 కోచ్‌లో స్నేహితులతో కలిసి బయలుదేరాడు. రైలు కోచ్ నుంచి సురక్షితంగా బయటపడి భువనేశ్వర్ చేరుకున్నాడు. అక్కడ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కి సాయంత్రం ఏలూరు వచ్చాడు. తమ కుమారుడు ఘోర ప్రమాదం నుంచి సురక్షితంగా ఏలూరు చేరుకోవడంపై తల్లిదండ్రులు, సోదరుడు ఆనందం వ్యక్తం చేశారు.

వెనక్కి వెళ్లిన బంగారం వ్యాపారి

కోరమండల్ రైలులో సత్రాంగచ్చీ స్టేషన్‌లో బీ–1 బెర్త్ నంబర్ 59లో కోల్‌కతాకు చెందిన ఘోరాచంద్ పాల్ ప్రయాణించారు. ఇతను ఏలూరులోని బంగారు దుకాణాల నిమిత్తం ఇక్కడకు బయలుదేరారు. ఆయనకు స్వల్పగాయాలు కాగా ప్రమాదం జరిగిన ప్రాంతంలోని ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి స్వస్థలం (కోల్‌కతా)కి వెళ్లిపోయారని ఏలూరు రైల్వే సూపరింటెండెంట్ ఎస్వీ రమేష్ తెలిపారు.

ఏం జరిగిందో తెలియలేదు



ప్రమాదం జరిగిన తర్వాత కొద్దిసేపు ఏం జరిగిందో తెలియలేదు. తర్వాత తేరుకుని ప్రమాదం జరిగిన విషయాన్ని గమనించి మా కోచ్‌లోని రాడ్లను పట్టుకుని కిందకు వచ్చాం. మా కోచ్ స్వల్పంగా దెబ్బతింది. నాతో పాటు నా మిత్రులు సురక్షితంగా బయటపడ్డారు. అక్కడి రైల్వే సిబ్బంది, స్థానికుల సహకారంతో ప్రమాద స్థలం నుంచి కిలోమీటరు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నుంచి బస్సులో భువనేశ్వర్ చేరుకున్నాం. ఉదయం అక్కడ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాం.

– పిల్లి శ్రీకర్‌బాబు, ఏలూరు

సమాచారం ఇవ్వండి

తాడేపల్లిగూడెం: కోరమాండల్ రైలు ప్రమాదంలో చిక్కుకున్న వారెవరైనా ఉంటే తాడేపల్లిగూడెం జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. ప్రమాద స్థలంలో చిక్కుకుని ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించి సాయం పొందాలని, పోలీసు హెల్ప్‌డెస్కు నంబరు 9490617090లో సంప్రదించాలని కోరారు.

రైల్వే హెల్ప్‌డెస్క్‌లు

తణుకు: కోరమాండల్ ప్రమాదంలో ఎవరైనా మృతులు లేదా క్షతగాత్రులు ఉంటే సమాచారం ఇవ్వాలని భీమవరం రైల్వే సీఐ ఎస్.శంకరరావు అన్నారు. వీరి ఆచూకీ విజయవాడ రైల్వే ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ద్వారా గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆచూకీ లేని వారి ఫొటో ఇతర వివరాలు 83339 05022 నంబర్‌కు వాట్సాప్ చేయడం లేదా భీమవరం రైల్వే పోలీసుస్టేషన్ 08816 232107 లేదా 1070, 112, 18004250101 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

కలెక్టరేట్‌లలో కంట్రోల్‌రూమ్‌లు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. రైలు ప్రమాదంలో ఎవరైనా చిక్కుకుంటే వివరాలు తెలపాలని ఆమె కోరారు. కంట్రోల్ రూమ్ 08816 299219 నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.

ఏలూరులో..

ఏలూరు (టూటౌన్): ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా చిక్కుకుంటే వివరాలు కంట్రోల్ రూంకి తెలియాజేయాలని కోరారు. కంట్రోల్ రూమ్ నంబర్ 08812–224519, టోల్‌ఫ్రీ నంబర్ 1800–2331077, వాట్సాప్ నం.94910 41435 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఏలూరులో పోలీస్ హెల్ప్‌డెస్క్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ 8332959175, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ 9440404042 నంబర్లలో సంప్రదించవచ్చని కోరారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు రైల్వేస్టేషన్‌లో 08812–232267 నంబర్‌తో రైల్వే అధికారులు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని ఏలూరు రైల్వే సూపరింటెండెంట్ ఎస్వీ రమేష్ తెలిపారు. పలు రైళ్లను దారి మళ్లించారన్నారు. విజయవాడ–రాజమండ్రి(07459), రాజమండ్రి–విజయవాడ (07460), రాజమండ్రి–విశాఖ(07466), విశాఖ–రాజమండ్రి (07467), కాకినాడ పోర్ట్–విశాఖ(17267), విశాఖ–కాకినాడ పోర్టు (17268), కాకినాడ పోర్టు–విజయవాడ(17258), విజయవాడ–కాకినాడ పోర్టు (17257), గుంటూరు–విశాఖ (17239), విశాఖ–గుంటూరు (17240), విశాఖ–విజయవాడ (22701), విజయవాడ–విశాఖ (22702) రైళ్లను శనివారం నుంచి 9వ తేదీ వరకు రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 60 రోజులకు రూ.55,23,193 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. అలాగే బంగారం 106 గ్రాములు, వెండి 234 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు లభించాయన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 71 శాతం హాజరు

సాక్షి, భీమవరం: జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 71.86 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. హిందీ పరీక్షకు 2,516 మందికి 1,808 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

డీఐపీఆర్వోగా నాగేశ్వరరావు



సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్వో)గా టి.నాగేశ్వరరావు నియామితులయ్యారు. ఇక్కడ అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన దాసరి నాగార్జున పదోన్నతిపై కాకినాడ బదిలి కావడంతో ఇక్కడ ఖాళీగా ఉన్న ఏడీ పోస్టులో నాగేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో నాగేశ్వరరావు శనివారం డీఐపీఆర్వోగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

చిరుత సంచారంపై నిఘా



సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత పులి కదలికలపై అటవీ శాఖాధికారులు నిఘా పెట్టారు. గత నెల 31న ప్రాజెక్టు ప్రాంతంలో 902 హిల్ ప్రాంతంలో గోదావరి నదిలో నీటి కోసం వచ్చిన చిరుత పులి పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించారు. దీంతో చిరుత కదలికలపై సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి ఏ ప్రాంతంలో సంచరిస్తుంది అనేది పరిశీలిస్తున్నట్టు అటవీశాఖ రేంజ్ అధికారి ఎం.దావీదురాజు తెలిపారు. కొండల దిగువన సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసి చిరుత కదలికలపై పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులను కూడా అప్రమత్తం చేశామన్నారు. వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో అభయారణ్య ప్రాంతంలో ఎక్కడా నీరు లేకపోవడంతో సహజంగా ఈ రోజుల్లో గోదావరి నదికి జంతువులు వచ్చి నీరు తాగి వెళుతుంటాయని, చిరుతకు రెండు, మూడు రోజులకోసారి నీరు తాగే అలవాటు ఉంటుందన్నారు. సిబ్బంది పర్యవేక్షణతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కదలికలపై నిఘా పెట్టామన్నారు.

మహిళాభివృద్ధికి పొదుపు దోహదం

కలెక్టర్ ప్రశాంతి



సేవింగ్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ ప్రశాంతికి అందిస్తున్న పోస్టల్ సర్వీసు డైరెక్టర్ మహాదేవ అప్పా

సాక్షి, భీమవరం: మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగినపుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని.. ఇందుకు చిన్న మొత్తాల పొదుపు దోహదపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వర్తకసంఘ భవనంలో ఏర్పాటుచేసిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకులతో పోటీగా పోస్టాఫీసుల్లో 12,490 ఖాతాలను ప్రారంభించి సుమారు రూ.10.40 కోట్లు జమచేయడం అభినందనీయమన్నారు. మహిళలు, ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పొదుపు పథకం ప్రారంభించిందన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది బ్యాంకుల మాదిగా పోస్టల్ కార్యాలయాల్లో సహకారం అందిస్తే బాగుంటుందన్నారు. భీమవరం పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మైనర్ ఆడపిల్లల పేర్లతో సహా మహిళలంతా ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. ఈ పథకం 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి స్వయంగా ప్రారంభించిన ఖాతాకు సంబంధించిన సర్టిఫికెట్లను పోస్టల్ సర్వీసు డైరెక్టర్ సందేశ్ మహాదేవ అప్పా అందజేశారు. పోస్టల్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 6న సీఎం జగన్ పోలవరం రాక
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 6న ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఉదయం 10.15 గంటలకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి హెలికాప్టర్‌లో చేరుకుని, అనంతరం ప్రాజెక్టులోని దిగువ కాఫర్ డ్యాం, ఎగువ కాఫర్ డ్యాం, స్పిల్‌వే, ఎర్త్‌కం రాక్‌ఫిల్‌డ్యాం నిర్మాణాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తారన్నారు. అనంతరం ప్రాజెక్టు సమావేశపు హాలులో ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు, అధికారులు, వివిధ శాఖల అధికారులతో నిర్మాణ పనుల పురోగతి, నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షిస్తారన్నారు. అనంతరం హెలికాప్టర్‌లో తాడేపల్లి బయలుదేరి వెళతారని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలనీ, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు తదితర అంశాలపై సవివరమైన నివేదికలను రూపొందించి ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్‌లకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను, హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలనీ రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.

సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కలెక్టర్ కోరారు. జేసీ బి.లావణ్య వేణి, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, అసిస్టెంట్ కలెక్టర్లు అపూర్వ భరత్, శ్రీపూజ, డీఆర్ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌బాబు, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జెడ్పీ సీఈఓ కె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎస్ఎస్‌సీ కమిటీ చైర్మన్



ప్రదక్షిణలు చేస్తున్న చైర్మన్ కిషోర్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కమిటీ చైర్మన్ ఎస్.కిషోర్ (ఢిల్లీ) శనివారం సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, దేవస్థానం ఏఈఓ కేఎల్ఎస్ రాజు చినవెంకన్న మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ పాలన

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



శంకుస్థాపన చేస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ రవీంద్ర

పెనుగొండ: దేశంలో ఎక్కడాలేని విధంగా బడుగు, బలహీన, దళిత వర్గాలకు అండగా నిలిచి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శనివారం ఆచంట గ్రామంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించే పెదపేట ఎస్సీ కమ్యూనిటీ హాల్, కాపులపాలెంలో కాపు కమ్యూనిటీ హాల్, కాపు శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్, ఎస్సీ మాదిగ కమ్యూనిటీ హాల్, దేవాంగుల కమ్యూనిటీ హాల్, నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్, ఉప్పరి కమ్యూనిటీ హాల్, విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 100కు పైగా కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి అంకురార్పణ చేశామన్నారు. ప్రతి భవనాన్ని తన బాధ్యతగా భావించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ అన్నివర్గాలతో పాటు రైతులకు వినూత్న రీతిలో పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు ఎంతటా దుష్ప్రచారం చేస్తున్నా పాలన పారదర్శకంగా ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, ఆచంట సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు జక్కంశెట్టి చంటి, జక్కంశెట్టి శ్రీరాములు, దిరిశాల విజయలక్ష్మి, బుల్లియ్యలు, మాజీ ఎంపీపీ మట్టా ఆనందకుమార్, ఎంపీటీసీలు తప్పెట్ల విజయకుమారి, ఉల్లం జ్యోతి పాల్గొన్నారు.

చేపల ఎగుమతులపై అసత్య ప్రచారం నమ్మొద్దు

సాక్షి, భీమవరం: ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంత మంది దళారులు ఇక్కడి చేపల ఎగుమతులపై దుర్వాసన (ఫర్మలిన్) వస్తుందని అసత్య ప్రచారం చేసి లాభాలు పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భీమవరం పరిసర ప్రాంతాల నుంచి ఈశాన్య రాష్ట్రాలకు చేపలు ఎగుమతి అవుతున్నాయని ఆయా రాష్ట్రాల దళారులు అక్కడ మార్కెట్లలో ధరల పెంపునకు అనుగుణంగా మన చేపలు దుర్వాసన వస్తున్నాయని ప్రచారం చేసి లాభాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి 80 శాతం వరకు ఎగుమతులు అవుతున్నందున శీలావతి చేపల ధర కిలో రూ.115 ఉందని, దళారుల మాటలు నమ్మి చేపల రైతులు మోసపోవద్దని సూచించారు.

కఠోర శ్రమతో లక్ష్య సాధన



ఐటీఐలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ అకడమిక్ డైరెక్టర్ మురళీకృష్ణ

ఉండి: లక్ష్యాన్ని సాధించేందుకు కఠోర శ్రమ తప్పదని జేఎన్‌టీయూ అకడమిక్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో జన్ భాగీదరి–2023 ఇండియా కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన, స్వచ్ఛభారత్, జాబ్ మేళా, డిబేట్, పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కెరీర్ గైడెన్స్‌కు ప్రాధాన్యమివ్వాలని, సానుకూల దృక్పథంతో అనుకున్నది సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఐటీఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మొగల్తూరు: కారు ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని ఎస్సై ఎం.వీరబాబు శనివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తోట గ్రామానికి చెందిన చింతా భాను గత నెల 31న భార్యతో కలిసి బైక్‌పై భీమవరం వెళ్లారు. తిరిగివస్తుండగా కాళీపట్నం సమీపంలో కారు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో భానుకు గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

7 నుంచి 9 వరకు వరి విత్తనాల విక్రయాలు

పెనుమంట్ర: మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకూ వరి విత్తనాలను విక్రయిస్తామని పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధనా స్థానంలో ఎంటీయూ 1,121 (శ్రీధృతి), ఎంటీయూ 3,626 (ప్రభాత్), ఎంటీయూ రైస్ 1,273, ఎంటీయూ 1,293, ఎంటీయూ 1,224 (మార్టేరు సాంబా), పీఎల్ఏ 1,100 రకాలు, విడుదలకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ 1,271, ఎంటీయూ 1,282 రకాల వరి వంగడాలను రైతులకు విక్రయిస్తామన్నారు. పునాది విత్తనం, సత్య ప్రమాణపూర్వక సీడు గల విత్తనాలు కిలో రూ.35 విడుదలకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ 1,271, ఎంటీయూ 1,282, సన్నరకం ఎంటీయూ 1,224 రకాలు కిలో రూ.42 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు కార్యాలయ పనివేళల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల లోపు సంప్రదించాలని తెలిపారు. పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్న విత్తన పరిమాణం మేరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

పుడమి.. పులకరింత

నేడు ఏరువాక పున్నమి

- తొలకరి పిలుపుతో సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- నాగలి, కాడె, ఎడ్లకు సంప్రదాయబద్ధంగా పూజలు
- ఇప్పటికే ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసిన అధికారులు



బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో నాగలితో పొలం దున్నుతున్న రైతు (ఫైల్)



కాడెడ్లకు పూజలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: తొలకరి పిలుపుతో పుడమి పులకరిస్తున్నాయి. రైతుల మోములో చిరునవ్వులు చిగురిస్తున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభంతో రైతుల జీవితంలో కీలకమైన సందర్భం ఏరువాక పున్నమి. ఖరీఫ్ ప్రారంభంలో వచ్చే జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమినే ఏరువాక పౌర్ణమిగా పిలుస్తారు. ఏరువాక పౌర్ణమి అన్నదాతలకు ఇష్టమైన పండుగ. ఈ రోజు రైతన్నలు నాగలి పట్టి పొలాలు దున్ని మాగాణి భూముల్లో నాట్లు వేస్తారు. ఓషధులకి, సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జేష్ఠా నక్షత్రానికి చేరువలో ఉన్న తరుణంలో ఏరువాక పూర్ణిమ శుభ ఫలితాలను అందిస్తాడు. అందుకనే జ్యేష్ఠ పూర్ణిమ నాడు మొదటిసారి పొలాన్ని దున్ని వ్యవసాయ పనులను సన్నద్ధం చేస్తారు. పూర్వ కాలం నుంచి జేష్ఠ పూర్ణిమను ఏరువాక పౌర్ణమిగా పిలుస్తున్నారు.

దుక్కిటెడ్లకు అలంకరణలు, పూజలు

ఏరువాక పూర్ణమి రోజు వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి పసుపు, కుంకుమలు పెట్టి పూజలు చేస్తారు. పొలాలు దున్నే దుక్కిటెడ్లను కడిగి వాటిని అలంకరిస్తారు. కొమ్ములకు రంగులు వేసి మెడలో కొత్త గంటలు, రంగుల పూసలు, పూలతో నిండిన దిష్టితాళ్లు కట్టి అలంకరిస్తారు. వాటి కాళ్లకు గజ్జెలు కడతారు. నాగలికి, కాడికి రంగులు వేసి పశువులను కట్టే స్థలాన్ని శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

జిల్లాల్లో ఖరీఫ్ సాగుకు రంగం సిద్ధమైంది. పంటల సాగులో రైతులకు అన్ని విధాలా సహాయాన్ని అందిస్తూ సేద్యాన్ని మరింత పోత్సహించే విధంగా వ్యవసాయశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. సాగుకు సంబంధించి 2023 సంవత్సరానికి ఖరీఫ్ ప్రణాళికలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. జిల్లాలో 2.50 లక్షల హెక్టార్లలో ప్రధాన పంట అయిన వరి పంట పండించేలా అధికారులు రైతులను సిద్ధం చేస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో సాగుకు ప్రణాళిక

గిరిజన ప్రాంతంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15,869 హెక్టార్లలో పంటలు పండించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో సుమారు వరి 13,295 హెక్టార్లలో, మొక్కజొన్న 1,484 హెక్టార్లు, మినుము 382 హెక్టార్లు, పెసర 424 హెక్టార్లు, కంది 284 హెక్టార్లలో పండించేలా రైతులను సిద్ధం చేస్తున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. వ్యవసాయ కమిషన్ ఏర్పాటు ద్వారా ఎన్నో సూచనలు స్వీకరించి రైతుల సంపూర్ణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యవసాయానికి సంబంధించి అన్ని అవసరాలను గుర్తించి సాగుకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. ఈ ఏడాది ఐదో విడత రైతు భరోసా సొమ్ములను కూడా రైతుల బ్యాంక్ ఖాతాలకు ఇప్పటికే జమ చేసింది.

రైతులకు అండగా సీఎం జగన్



రైతులకు అండగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మా గ్రామంలోనే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. చాలా సంతోషంగా ఉంది. నిజంగానే ఇది రైతుల ప్రభుత్వం.

– ధర్ముల బాబూరావు, గిరిజన రైతు, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం

రైతులకు అందుబాటులో సేవలు



రైతులకు అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేలా సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులోనే ఉంటూ సేవలందిస్తున్నాం. ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– పీజీ బుచ్చిబాబు, ఏడీఏ, కేఆర్ పురం, బుట్టాయగూడెం మండలం

పండుగలా వ్యవసాయం



రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతు కళ్లల్లో ఆనందం చూస్తున్నారు. నేడు వ్యవసాయాన్ని జగనన్న పండగలా మార్చారు. రైతులకు అన్ని సేవలు అందుబాటులోకి రావడంతో ఖరీఫ్ పనులకు రైతులు సిద్ధమవుతున్నారు.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

చిన్నతిరుపతికి పోటెత్తిన భక్తులు



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు దేవస్థానం సిబ్బంది మజ్జిగను పంపిణీ చేశారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

స్కూల్ గేమ్స్ జాతీయ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



కళాశాలలో యోగాసనాలను సాధన చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన ఏడుగురు పీయూసీ విద్యార్థులు యోగాసన విభాగంలో ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ స్థాయి అండర్–19 పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 12 మంది విద్యార్థులు 14 స్థానాలకు పోటీపడుతుండగా నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఏడుగురు తొమ్మిది స్థానాలకు పోటీపడుతున్నట్లు యోగా ఇన్‌స్ట్రక్టర్ అక్కినేని సత్యశ్రీధర్ తెలిపారు. ఆళ్ల వెంకట లక్ష్మి నిఖిల, చిట్టూరి దివ్య, వేమిరెడ్డి హిమజ, శిగలపల్లి ప్రమీల, కనకల లక్ష్మణరావు, పెడద భరత్‌కుమార్, రవణం వీఎస్ఎం శేషసురేష్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 4న ఢిల్లీకి పయనమవుతుండగా వీరితో పాటు కోచ్ అక్కినేని సత్యశ్రీధర్, సీనియర్ యోగా అథ్లెట్, మేనేజర్ కారపురెడ్డి పద్మజ వెళ్లనున్నారు. వీరిని ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు, సీఏవో భానుకిరణ్, ఏఓ ప్రదీప్ అభినందించారు.

6 నుంచి వాహనాల వేలం

జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో, రవాణా కార్యాలయం డ్రైవింగ్ ట్రాక్‌లో ఉన్న నిర్బంధిత వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం, తణుకు, నరసాపురం, తాడేపల్లిగూడెం డిపోలలో నిర్బంధ వాహనాలు 103 ఉండగా, వీటిలో మోటార్ సైకిళ్లు, ఆటో రిక్షాలు, మ్యాక్సీ క్యాబ్‌లు, ట్రాక్టర్లు, ఎల్‌జీవీలు, ట్రైలర్లు ఉన్నాయన్నారు. జూన్ 6న భీమవరం డ్రైవింగ్ ట్రాక్, ఆర్టీసీ డిపోలో, జూన్ 7న నరసాపురం ఆర్టీసీ డిపోలో, జూన్ 8న తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో, జూన్ 9న తణుకు ఆర్టీసీ డిపోలో వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఒకరోజు ముందు తమ పేర్లను భీమవరం ఆర్టీఏ కార్యాలయంలో ఆధార్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు.


5న బీచ్ క్లీనింగ్



కేపీపాలెం బీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

మొగల్తూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ ఐదో తేదీన కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లోని సముద్రం ఒడ్డున బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, నరసాపురం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లు పాల్గొంటారన్నారు. వీరితోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, రవాణా శాఖ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటారన్నారు. ఔత్సాహికులైన పర్యావరణ ప్రేమికులు కూడా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చన్నారు. ఆ రోజు సుమారు 800 మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని అంచనా వేస్తున్నట్లు వివరించారు. జూన్ ఐదో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు క్లీనింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనిలో పాల్గొన్న వారందరికీ బీచ్‌లో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మొగల్తూరు, నరసాపురం తహసీల్దార్లు జి.అనితకుమారి, ఎం.ఫాజిల్ ఉన్నారు.

వైభవంగా చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్ : పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం మారేపల్లి ప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొన్న 22 మంది దంపతులకు, భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. హోమం అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడదెబ్బకు ఎలక్ట్రీషియన్ మృతి

చాట్రాయి: వడదెబ్బకు గురై ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన మోదుగు జ్ఞానేసు (40) ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. శనివారం పని నిమిత్తం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ లెక్చరర్ మృతి

ఉండి: ఉండిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ లెక్చరర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావు (41) భీమవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం రాత్రి కళాశాలలో విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై బయలుదేరారు. ఉండి సెంటర్ నుంచి గణపవరం రోడ్డులో మలుపు తిరిగిన వెంటనే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని 108లో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కె.గంగాధరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై మెరుపు దాడి

ఐదుగురి అరెస్టు, రూ.2,88,750 నగదు స్వాధీనం

ముసునూరు: మండలంలోని సూరేపల్లి అడవిలోని ఎన్నెస్పీ కాలువ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం సాయంత్రం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.2,88,750 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ దాడిలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు సులభం...రైతుకు ఆదాయం

- రైతులకు అండగా జగనన్న ప్రభుత్వ సాయం
- వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రభుత్వ ప్రోత్సాహం


పవర్‌ట్రిల్లర్ పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


సబ్సిడీపై అందించిన వరికోత యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పెంటపాడు: దేశానికి వెనుముకగా నిలుస్తున్న రైతును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆదుకుంటోంది. రైతులను అన్ని రకాలుగా అదుకొనేందుకు జగనన్న ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. ప్రధానంగా రైతు భరోసా ద్వారా రైతులకు సాయం, ఆ ఏడాది నష్టసమంలో ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, శాస్త్రవేత్తల సలహాలతో పాటు, ఎన్నో రకాలుగా కోట్లాది రూపాయలు నిధులు రైతుల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది. ఇటీవల కాలంలో డ్రోన్‌ల వినియోగం మెట్టప్రాంతాల్లోని ఉద్యాన తోటలతో పాటు, డెల్టాలో వరి పైరుపై కూడా పెరిగింది. దాని కనుగుణంగా రాబోయే రోజుల్లో డ్రోన్‌లు రైతులు నేరుగా పొందే అవకాశం కూడా ఉంటుంది. దీనికి శిక్షణ కూడా కొన్ని ప్రాంతాల్లో ఇస్తున్నారు.

ఆధునిక వ్యవసాయం, యంత్రపరికరాలు:
మారుతున్న కాలానికి అనుగుణంగా రైతుకు తోడ్పాటు నందిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం తీసుకొస్తోంది. రైతులను సంఘటితం చేసి తమకు అవసరమైన యంత్ర పరికరాలు వారే ఎంచుకొనే విధంగా ప్రభుత్వం చైతన్య పరుస్తోంది. ఎంపిక చేసుకొన్న పరికరాలను సబ్సీపై అందిస్తోంది. గత ప్రభుత్వంలో ఏదో ఒక పరికరాన్ని తెచ్చి దానిని సబ్సీడీపై తీసుకోవాల్సిందిగా రైతులను ఆదేశించేవారు. వాటిలో రైతులకు ఉపయోగపడనివే అత్యధికంగా ఉండేవి. కాగా నేడు అన్ని రకాల యంత్రపరికరాలు అధికశాతం సబ్సీడీపై రైతులు ఎంచుకొనే అవకాశాన్ని కల్పించారు.

కష్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా సేవలు:
జగనన్న ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కష్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసింది. సాగు చేసే రైతుల అవసరాలను గుర్తించి వాటినే రైతులకు అందజేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ద్వారా అన్ని రకాల పనిముట్లతో పాటు, కలుపుతీసే యంత్రాలు, పురుగుమందులు పిచికారి చేసే డ్రోన్‌లు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

యంత్రాలు అందజేత:
మండలంలో రైతులకు ఇప్పటికే ఈ ప్రభుత్వం ద్వారా సబ్సీడీపై కోట్లాది రూపాయల పనిముట్లు అందజేశారు. ట్రాక్టర్లు- 2, పవర్‌ట్రిల్లర్‌లు -30, రోటీవేటర్లు- 2, కోతమిషన్‌లు-2, గడ్డి చుట్టే యంత్రాలు-2, తైవాన్ స్ప్రేయర్లు, రైతులకు అందజేసింది.

ఇది రైతు ప్రభుత్వం



రైతులు బాగుండాలనే ఉద్ధేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. ఇటీవల రైతు భరోసా అందించారు. యంత్ర సాయం కింద ట్రాక్టర్లు అందించారు. అకాల వర్షాలు వచ్చినా జగనన్న దాళ్వా పంట కొనుగోలు చేసి సకాలంలో సొమ్ములు రైతుల ఖాతాలో జమచేశారు. రైతుకు ఇంతకన్నా ఏం కావాలి.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు, రైతు

యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి



ఆధునిక వ్యవసాయంలో భాగంగా శాస్త్రవేత్తల సూచనలు సలహాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించడంతో పాటు, కష్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూలీల కొరతను నివారించేందుకు యంత్రాల వినియోగం అవసరం. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇప్పటికే 9 గ్రూపులకు అందజేశాం. కాగా మరింత మంది వీటిని పొందేందుకు వీలుగా ఐదుగురు సభ్యులు గ్రూపులుగా ఏర్పడాలి. దరఖాస్తు చేసుకొన్నవారికి యంత్రాలు సబ్సీడీపై అందిస్తాం.

– మండల వ్యవసాయాధికారి, కె. పార్ధసారధి

క్లుప్తంగా

బార్ అండ్ రెస్టారెంట్‌ను మూయించి వేసిన మంత్రి కారుమూరి



అత్తిలిలో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌ను మూయించి వేసిన దృశ్యం

అత్తిలి: స్థానికంగా ఏర్పాటు చేసిన మొగలి రెస్టారెంట్‌అండ్ బార్‌ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మూయించి వేశారు. అత్తిలి గ్రామ పంచాయితీ పరిధిలో ప్రారంభించిన బార్ అండ్ రెస్టారెంట్‌ను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దృష్టికి రావడంతో వెంటనే తక్షణమే దానిని క్లోజ్ చేయించారు. ఈసంఘటనపై సంబంధితశాఖ అధికారులపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అత్తిలిలో ఉచిత వైద్య శిబిరం


అత్తిలిలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అత్తిలి: స్థానిక నేతాజీ నగర్‌లో దైవశక్తి ఆరాధన కేంద్రంలో ఫ్రెండ్స్ మెమోరియల్ అసోసియేషన్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. పాస్టర్ దేవరాజు సమక్షంలో అత్తిలి సర్పంచ్ గంటా విజేత నాగరాజు సహకారంతో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు జరిపారు. 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు, 100 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ గంటా విజేత మాట్లాడుతూ పాస్టర్ దేవరాజు 25 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఒరిస్సా రాష్ట్రంలో కూడా గిరిజన ప్రజల మధ్యన ఆరోగ్య శిబిరాలు పెట్టి ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు.

లయన్స్‌క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం


పేదలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అదేవిధంగా రామారావుపేటలో పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. వక్తలు మాట్లాడుతూ వృద్ధులకు, నిరాశ్రయులకు చేయూత నివ్వడం బాధ్యత అన్నారు. ట్రెజరర్ మునగాల జితేంద్ర కుమార్, డీకేడీ సత్యనారాయణ, మధు, అంబికా, రేణుక, రామలక్ష్మి, మాధురి, నందిని తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన జలాలను సరఫరా చేయాలి

కాళ్ల: చెరువులో నీటిని ఫిల్టర్ చేసి, శుద్ధి చేసిన జలాలను మాత్రమే కుళాయిల ద్వారా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టి.శ్రీనివాసరావు అన్నారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో మంచినీటి చెరువు, ఫిల్టర్ బెడ్స్ ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా ఉండేవిధంగా ఎప్పటికప్పుడు ఫిల్టర్ బెడ్స్ శుభ్రపరుచుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కాలువలకు నీటిని విడుదల చేసిన తరుణంలో గ్రామాలకు వచ్చేసరికి మంచినీటి చెరువులు గట్లు శుభ్రపరచుకుని నీరు నింపుకోవడానికి సిద్ధంగా ఉండాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. దీనిపై అన్ని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా తాగునీరు క్లోరినైజేషన్ పై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు అండ

నరసాపురం: అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అంగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 3వవార్డు కౌన్సిలర్ బొంతు రాజశేఖర్ బంధువుకు ఇటీవల ఆరోగ్యశ్రీ పథకంలోలేని జబ్బుకు వైద్యం చేయించారు. దీంతో అతని వైద్య ఖర్చులకు మంజూరైన రూ.5 లక్షలు చెక్కును శనివారం ముదునూరి తన కార్యాలయంలో బొంతు రాజశేఖర్‌కు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదల వైద్యం విషయంలో దృష్టి పెట్టి పనిచేస్తుందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, మొగల్తూరు మండలాల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, కర్రి ఏసుబాబు. రేవు రాంబాబు పాల్గొన్నారు.

పర్యావరణం, ప్లాస్టిక్‌లపై కళాజాత ప్రదర్శన


తణుకులో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండల ఆధ్వర్యంలో శనివారం కళా జాత నిర్వహించారు. శనివారం తణుకు మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో బాగంగా మిషన్ లైఫ్‌లో బాగంగా జీవన విధానాన్ని మెరుగుపర్చుకునే విధానాలు, పర్యావరణాన్ని కాపాడే పద్ధతులను వివరించారు.

ఈనెల 5న పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

అత్తిలి: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5వ తేదీ సాయంత్రం తమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో అత్తిలి శాఖ తరపున పర్యవరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఆదేశాను సారం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పీఠంసభ్యులంతా ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

యోగాతో మానసిక ఆరోగ్యం


గూడెం కడకట్ల మున్సిపల్ హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పెంటపాడు: యోగా ద్వారానే, శారీరక, మానసిక ఆరోగ్యం తథ్యమని కడకట్ల మున్సిపల్ హెచ్ఎం కె. తబిత పేర్కొన్నారు. మే నెల 1 నుంచి గూడెం కడకట్ల మున్సిపల్ హైస్కూల్లో వేసవి యోగా తరగతుల శిక్షణ ముగింపు పురష్కరించుకొని శనివారం స్థానిక పాఠశాలలో జరిగిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ తరగతుల్లో యోగా టీచర్ జి. రూప విద్యార్థులకు యోగా మెలుకువలు తెలిపారు. సుమారు 30 రోజులపాటు నేర్చుకొన్న ఈ విద్యను నిత్యం ఆచరిస్తూ తోటివారికి పంచాలన్నారు. తద్వారా వత్తిడి నుంచి విముక్తులై ఆరోగ్యం సంక్రమిస్తుందన్నారు. ఉపాధ్యాయులు టి. సూర్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముగింపు పురస్కరించుకొని పలు యోగాసనాలు వేయించారు. సుమారు 60 మందికి పైగా గృహిణిలు, విద్యార్థులు, చిన్నారులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రభుత్వ ఆయుష్ శాఖ, బుద్ధయోగ ఫౌండేషన్ ద్వారా ధృవపత్రాలు అందించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు


అత్తిలి శాఖా గ్రంథాలయంలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహపూరితంగా జరుగుతున్నాయి. పట్టణంలో గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు 26వ రోజు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ప్రత్తి వీరాస్వామిచే కథల పుస్తకాలు, నీతి కథలు, ఆటపాటలు నేర్పించారు. విశ్రాంత ఎంఈఓ సాల్మన్‌రాజుచే స్పోకెన్ ఇంగ్లీషు, సైన్సు, ఎ.జనార్ధనరావుచే డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే తెలుగు గ్రామర్, సామెతలు నేర్పించారు.

శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ
అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, స్టోరి టెల్లింగ్, నీతి కథలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా రిసోర్సుపర్సన్స్ డేవిడ్‌రాజు, విజయకుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు నీతికథలు నేర్చుకోవడం ద్వారా అందులోని నీతిని గ్రహించాలన్నారు. టీచర్ కె కోమలి విద్యార్థులకు శతక పద్యాలు, యోగాపై అవగాహన కల్పించారు. బండి పావని, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

కొండేపాడు కల్వర్టుకు మరమ్మతులు


కొండేపాడు గ్రామంలోకి వరదనీరు రాకుండా కల్వర్టుకు మరమ్మతులు చేయించుకున్న రైతులు

పెంటపాడు: యనమదుర్రు డ్రైయిన్ కొండేపాడు కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఎంతో కాలం నుంచి ఈ కల్వర్టు మరమ్మతులకు నోచుకోక పోవడంతో అధికారులకు రైతులు విన్నవించారు. దీంతో మరమ్మతులకు నిధులు లేవని, నూతనంగా కల్వర్టు నిర్మించుకొనేందుకు రూ.36 లక్షల మోడరైజేషన్ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. కాగా వచ్చే ఏడాది పనులు చేయనున్న దృష్ట్యా గట్టు తెగకుండా కల్వర్టుకు సపోర్టుగా తాత్కాలికంగా ఇరన్ స్తంబాలు, కాంక్రీటుతో వేసి రైతులు తాత్కాలిక ఏర్పాటు చేసుకొన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలా గణపతి ఆధ్వర్యంలో ఈపనులు రెండు రోజులపాటు జరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత ప్రాతిపదికన నూతన కల్వర్ట్ నిర్మించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మద్రే కృష్ణమూర్తి, కోరిమిల్లి సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు దేవరశెట్టి రాంబాబు, రైతులు బొబ్బా రామారావు, యార్లగడ్డ పాపారావు, పిల్లి నాగరాజు, అల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



పట్టణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ న్యూ డెమెక్రసీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమెక్రసీ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమెక్రసీ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళా రెజ్లర్లను వేధించడం, శరీర భాగాలను తాకడం, అసభ్యకరంగా మాట్లాడటం వంటి చర్యలకు పాల్పడుతున్న భారత రేసింగ్ సమైఖ్య అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ఇటువంటి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.కోటేశ్వరరావు, వెంకన్నబాబు, యేసురత్నం, సతీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో విశాఖ విహారయాత్ర

నరసాపురం: నరసాపురం డిపో నుంచి ప్రతీశనివారం ఏర్పాటు చేసిన విశాఖ యాత్ర సూపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి 7 గంలకు బస్టాండ్ నుంచి బయలుదేరి వెళ్లింది. డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి.ధనలక్ష్మి బస్సును ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి శనివారం బస్టాండ్ నుంచి బయలుదేరి తిరిగి సోమవారం నరసాపురం చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి


తణుకులో రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

తణుకు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తణుకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ ఆందోళనలలో సీపీఎస్ రద్దు చేయాలని, ఓపిఎస్ పునరుద్ధరించాలని, 1993కు ముందు నియమితులైన ఎన్ఎంఆర్, కంటింజెంట్ ఉద్యోగులు, డీఎస్సీ ద్వారా నియామకం పొందిన కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణం విడుదల చేయాలని, పీఆర్‌సీ నియామకం లేకుండా ఉద్యోగ సంఘాలతో చర్చించి వేతనాలు పెంచాలని వంటి 160 డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బీహెచ్ రవీంద్రరాజు, జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, కార్యదర్శి చంద్రమౌళితో పాటు తణుకు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, తాలూకాలోని వివిధ మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మస్తరు విధానం రద్దు చేయాలి


పుల్లాయగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఆన్‌లైన్ మస్తరు విధానం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పుల్లాయగూడెం, నీలాద్రిపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ పాత పద్ధతిలోనే మస్తర్లు కొనసాగించాలన్నారు. వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలని, పలుగు, పారలకు ఇచ్చే సొమ్ములు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల రూతమ్మ, నారదన్న, రమణమ్మ, చెరుకు నాగమణి, పుట్టా సుబ్బారావు, మైలవరపు నాగేశ్వరరావు, బి.బాలుడు తదితరులు పాల్గొన్నారు.

9న ఇంటర్మీడియట్ విద్యార్థులకు వర్క్‌షాప్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎల్కక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఈ నెల 9న వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్ట్ కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు శనివారం ఆవిష్కరించిన వర్క్‌షాప్ వివరాలను చెప్పారు. నిపుణులైన ఫ్యాకల్టీతో ప్రొఫెషనల్ కెరీర్ గైడెన్స్ అండ్ స్ట్రాటజిక్ ప్లానింగ్ అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్క్‌షాప్‌లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఏ విధమైన మార్గాన్ని ఎంచుకుంటే బాగుంటుందనే అంశాలపై కెరీర్ గైడెన్స్‌లో వివరిస్తారన్నారు. ఉచితంగా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థులు 96525 08134, 99851 36660కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ హెడ్ ఎన్.ఉదయ్‌కుమార్‌ఎం సతీష్ కుమార్, పి.కనకరాజు, వైఎస్ఎస్ శ్రీరామ్, కేఎన్‌వీ సత్యనారాయణ, జై.గణేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి డయేరియాపై అవగాహన


వైద్య సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: గ్రామాల్లో డయేరియా మరణాలు లేకుండా వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని, అదేవిధంగా ఎండలు ఎక్కువగా కాస్తున్నందున ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు, వడగలుపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆవశ్యకత గురించి, జింక్ ట్యాబ్లెట్లు ఉపయోగం గురించి, డయేరియా మరణాలు గురించి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించవలసిన విషయాల గురించి అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ రంగం నాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు డాక్టర్ రంగనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లోని ఐదు సంవత్సరంలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు 15 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను అందించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలను ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని దానిపై ప్రత్యేకంగా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, నాగ మునెమ్మ పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలపై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రైతు ఉత్పాదక సంఘాలు, ఉద్యాన శాఖ పథకాలు, సూక్ష్మ, బిందు సేద్యం పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి ఎ.దుర్గేష్ ఉద్యాన శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, శాశ్వత పందిళ్లపై కూరగాయల సాగు, ఆయిల్ పామ్ తోటల విస్తరణ, ఆయిల్ పామ్, కొబ్బరిలో కోకో సాగు గురించి వివరించారు. జిల్లా సూక్ష్మ సేద్య అధికారి పి.వీరభద్రరావు ఉద్యాన తోటల్లో డ్రిప్ ద్వారా నీటిని ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను గురించి తెలియజేశారు. డ్రిప్ విధానంలో ఉద్యాన పంటల సాగుపై శిక్షన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ టి.సునీల్, మండల ఉద్యాన శాఖ అధికారి కె.ప్రియదర్శిని, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

తణుకు టౌన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో చేపట్టిన గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా ఇంజనీరింగ్ సిబ్బంది కృషి చేయాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌ల్లో సొంతంగా నిర్మిస్తున్న వారితో పాటు ఆప్షన్ 3లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన అంబేడ్కర్ జయంతి వేడుకలు

సాక్షి, భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ముగింపు సందర్భంగా శనివారం భీమవరంలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక 11వ వార్డులోని రాజ్‌ట్రస్ట్ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీనుద్దేశించి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా, మరపట్ల మునియ్య, గొల్లా రాజ్‌కుమార్, అద్దంకి డేవిడ్, గెద్దం జార్జ్, పట్టెం శుభాకర్, గూట్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.